ఇక అభివృద్ధి వేగవంతం



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కే.ఎస్.ఆనంద్‌రావు

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డిని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గౌలిపురా కోట మైసమ్మ ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కె.ఎస్.ఆనంద్‌రావు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని సీఎం చాంబర్‌లో కలిసి బొకే అందజేసి సన్మానించారు. తమ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం వేగంగా జరుగుతుందన్నారు.

ఉత్తం కుమార్‌రెడ్డికి అభినందనలు



చార్మినార్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఉత్తం కుమార్‌రెడ్డిని కలిసి బొకే అందజేసి అభినందనలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం జరుగుతుందన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- కానరాని పారిశుద్ధ్య పనులు
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



శాతం చెరువు వద్ద వ్యర్థాలు, పిచ్చి మొక్కలు

గోల్కొండ: కొంత కాలం నుంచి పారిశుద్ధ్య పనులు అరకొరగా సాగుతున్నాయి. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో కార్వాన్ నియోజకవర్గంలో మళ్లీ దోమల బెడద తీవ్రమైంది. నాలాలు, చెరువులు ఉన్న ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఎన్నికల ప్రకటన కంటే ముందు నుంచే పారిశుద్ధ్య పనులు సరిగా జరడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నాలాలు, చెరువుల ప్రాంతాలు డంపింగ్ యార్డులుగా మారాయి. గోల్కొండ కందకాలు, గోల్కొండ నయా ఖీల వద్ద గల శాతం చెరువు, హకీంపేట్ గుల్కాపూర్ నాలా, షేక్‌పేట్‌లోని ఎర్రకుంట చెరువు, కొత్త చెరువులలో ప్రతినిత్యం వ్యర్థాల డంపింగ్ జరుగుతుంది. షేక్‌పేట్‌లోని ఎర్రకుంట చెరువు మురికి కుంటగా మారింది. ఈ చెరువుకు ఉన్న ప్రహరీ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి ఆ పరిసరాలు అధ్వానంగా మారాయి. మరోవైపు కొత్త చెరువు పరిస్థితి సైతం అధ్వానంగా మారింది. ఈ చెరువులో పరిసర ప్రాంతాల వారు యథేచ్ఛగా డంపింగ్ చేస్తున్నారు. ఈ కారణాల వల్ల చెరువు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. కొన్ని ఏళ్ల క్రితం ప్రారంభించిన శాతం చెరువు సుందరీకరణ పనులు ఎప్పుడో ఆగిపోయాయి. చెరువు చుట్టూ వేసిన ఫెన్సింగ్ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆటో ట్రాలీలలో వ్యర్థాలు డంపింగ్ అవుతున్నాయి. శాతం చెరువులో తరచూ జరిగే పూడికతీత పనులు ప్రసహనంగా మారాయి. కేవలం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికే బల్దియా వారు చెరువు పూడికతీత పనులు చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మెహిదీపట్నం, టోలిచౌకీ తదితర ప్రాంతాల నుంచి కూల్చిన భవనాల శిథిలాలు సైతం శాతం చెరువు కట్టపైనే డంపింగ్ చేస్తున్నారు. మరోవైపు బుల్కాపూర్ నాలాలో సైతం పూడికతీత పనులు జరగడం లేదు. దీంతో ఆ ప్రాంతాలు కూడా దుర్గంధం వ్యాపించడమే కాకుండా నాలాలో దోమలు పెరిగిపోతున్నాయి. దోమ కాటు ఫలితంగా తగ్గిన విషజ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. డెంగీతో పాటు మలేరియాతో స్థానికులు ఆస్పత్రుల పాలవుతున్నారు.

మలేరియా సిబ్బంది ఎక్కడ...?

కొన్ని నెలల క్రితం నగరాన్ని వణికించిన డెంగీ మళ్లీ విజృంభిస్తుంది. అప్పట్లో మలేరియా సిబ్బంది దోమల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇంటింటికి తిరిగి దోమల మందును స్ప్రే చేశారు. కొంత కాలం నుంచి మలేరియా సిబ్బంది కానరావడం లేదని పలువురు అంటున్నారు. మలేరియా క్షేత్రస్థాయి అధికారులు సైతం కానరావడం లేదనే ఆరోపణలు కూడా ప్రజల నుంచి వస్తున్నాయి. ఇకనైనా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుతున్నారు.

నిద్ర కరువైంది..



దోమల వల్ల నిద్ర కరువైంది. ఆరు నెలలుగా పారిశుద్ధ్య పనులు సవ్యంగా జరగడం లేదు. అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. ప్రధాన రహదారుల వెంట చెత్త కుప్పలు పేరుకపోయాయి. ఇటువంటి ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల నివారణకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– దేవర శ్రీనివాస్, గుడిమల్కాపూర్

విష జ్వరాలు ప్రబలుతున్నాయి..



విష జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేదలు రోగాలతో బాధపడుతున్నారు. దవాఖానాలకు తిరుగుతూ కూలీపనులకు వెళ్లలేని పరిస్థితి ఉంది. మలేరియా అధికారులు, సిబ్బంది గాఢనిద్రలో ఉన్నారు. గుంపులుగా వార్డు కార్యాలయాల వద్ద కానవచ్చే మలేరియా సిబ్బంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

– షానవాజ్‌ఖాన్, గోల్కొండ

సీఎం రేవంత్‌రెడ్డి హయాంలోనే బంగారు తెలంగాణ



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధీర్‌కుమార్ తివారి

అబిడ్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, గోషామహల్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుధీర్‌కుమార్ తివారి (పండిత్) పేర్కొన్నారు. పదేళ్లుగా కేసీఆర్ నియంత పాలన అంతమొందడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి సికింద్రాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ తివారి మాట్లాడుతూ.. పదేళ్లపాటు రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావడంతో అన్నివర్గా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

తెలంగాణ అమరవీరులకు నివాళి



గన్‌పార్కు వద్ద నివాళులర్పిస్తున్న 1969 ఉద్యమకారులు

నాంపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని హర్షిస్తూ 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నాంపల్లిలోని గన్‌పార్కు ఎదుట 1969 ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరులకు వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చక్రహరి రామరాజు మాట్లాడుతూ.. గత పాలకులు 1969 ఉద్యమకారులను విస్మరించారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా 250 గజాల స్థలం, రూ.25వేల పెన్షన్, అమరుల కుటుంబానికి రూ.25 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ ఉపాధ్యక్షులు వనం చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మారం సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్ పక్కా సెక్యులర్ పార్టీ: కౌసర్



కార్వాన్ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: మజ్లిస్ పక్కా సెక్యులర్ పార్టీ అని కార్వాన్ శాసన సభ్యుడు కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయనను పలువురు మజ్లిస్ నాయకులు ఆయన మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో కార్వాన్ ఎమ్మెల్యేగా మళ్లీ విజయం సాధించానన్నారు. మజ్లిస్ పోటీ చేసిన తొమ్మిది స్థానాల్లో ఏడు స్థానాలు గెలుచుకోవడం తమ పార్టీకి ప్రజల పట్ల ఉన్న ఆదరణను స్పష్టం చేస్తుందని అన్నారు. రానున్న కాలంలో తాను కార్వాన్‌లోని అన్ని డివిజన్లలో కొత్త కమ్యూనిటీహాల్స్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు



అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మల్లు భట్టి విక్రమార్కను శుక్రవారం ఆయన నివాసంలో ఉస్మానియా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, ఆర్ఎంఓ డాక్టర్ రఫీ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కళా సంస్థలను ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కళా సంస్థలకు తగిన ప్రోత్సాహన్ని అందించాలని పలువురు కళాకారులు కోరారు. శుక్రవారం సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. కళాకారులు, కళలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

కనక విజయలక్ష్మికి డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న కనక విజయలక్ష్మి

నాంపల్లి: కివిస్ కిడ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకురాలు కనక విజయలక్ష్మి సేవలు అభినందనీయమని ది అమెరికన్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్, అంతర్జాతీయ శాంతి దూత డాక్టర్ మధు క్రిషన్ అన్నారు. మంగళవారం చెన్నైలోని టి నగర్ సోషల్ క్లబ్‌లో గ్లోబల్ పీస్ సమ్మిట్-2023 జరిగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన కనక విజయలక్ష్మి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఎడ్యుకేషన్ కేటగిరిలో డాక్టరేట్‌ను అందుకున్నట్లు విజయలక్ష్మీ తెలిపారు. గౌరవ డాక్టరేట్ రావడం నాపై బాధ్యత మరింత పెరిగిందని ఆమె తెలిపారు.

ముగిసిన హరికథా మహోత్సవాలు



భక్త మార్కండేయ హరికథ గానం చేస్తున్న పాల రామాంజనేయులు

సుల్తాన్‌బజార్: భక్త మార్కండేయ హరికథ గానం ప్రేక్షకులను ఎంతగానో రంజింపజేసింది. శ్రీ పూర్ణోదయ కళాపీఠం కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన హరికథ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ముట్నూరి యజ్ఞ నారాయణ శర్మ భాగవత 114వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ మహోత్సవాలు చివరిరోజు పాల రామాంజనేయులుచే నిర్వహించిన భక్త మార్కండేయ హరికథ గానం అలరించింది. ఈ కార్యక్రమానికి పాత్రికేయులు వల్లీశ్వర్, రామకృష్ణారావు హాజరై హరికథ గానాన్ని వీక్షించారు. ఈ గానానికి వాయిద్య సహకారం శశిభూషణ్‌రావు, సుధాకర్ అందించారు. ఈ కార్యక్రమంలో కిన్నెర అధ్యక్షులు ప్రభాకర్‌రావు, ముట్నూరి కామేశ్వరరావు, మద్దాలి రఘురామ్ తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



పూజలో పాల్గొన్న నవీన్ గురుస్వామి, రాజేష్ గురుస్వామి తదితరులు

అబిడ్స్: అయ్యప్పస్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. శ్రీహరి హర పుత్ర అయ్యప్ప సేవా సంఘం సికింద్రాబాద్ నివాస్ 18వ సంవత్సరం పూజలు పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ సేవా సంఘం నిరంతరం పలు సేవా కార్యక్రమాలు చేపడుతుంది. గణేష్ నిమజ్జనంలో ప్రసాదాల పంపిణీ లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాతబస్తీతో పాటు ప్రాంతాలకు చెందిన అయ్యప్ప స్వాములు ఈ మహా పడిపూజలో పాల్గొన్నారు.

చిరు ధాన్యాల వనభోజన సమ్మేళనం



సమ్మేళనంలో షేక్ గౌస్ మోహీనుద్దీన్, ల్యాబ్ డైరెక్టర్లు

సంతోష్‌నగర్: అందరూ తమ రోజువారీ జీవితంలో సాధారణ ఆహార పదార్థాలకు ప్రత్యామ్నాయంగా మిల్లెట్లను స్వీకరిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చునని ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ షేక్ గౌస్ మోహీద్దీన్ అన్నారు. కంచన్‌బాగ్‌లోని ఎస్టేట్ నర్సరీలో స్వచ్ఛతా ప్రఖ్వాడా, అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరం-2023లో భాగంగా మిల్లెట్స్ మిలన్ (చిరు ధాన్యాల వనభోజన సమ్మేళనం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ల్యాబ్ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిల్లెట్లు, వాటి ఉత్పత్తులు, ఔషధ మొక్కలు, మైక్రోగ్రీన్స్ మినీ ఎక్స్‌జీషన్ నిర్వహించారు. అన్ని రకాల మిల్లెట్‌ల పోషక, ఆరోగ్య ప్రయోజనాలను అర్బోరిక ల్చర్ టీమ్ వివరించారు. ఎస్టేట్ నర్సరీలో అధిక సాంద్రతతో సాగు చేయబడిన పండ్లు, ఆకుకూరలు, ఔషధ మొక్కలు మినీ ఎక్స్‌పో సమయంలో ప్రదర్శించారు. సాధారణ ఆహార పదార్థాలకు ప్రత్యామ్నాయంగా మిల్లెట్ ఆధారిత భోజనం అందించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా వివిధ రకాల చెట్లు, మొక్కలు, హైబ్రిడ్ మినియేచర్ పువ్వులు తదితర వాటితో కూడిన తోట మొక్కల కెటలాగ్ విశిష్ట అతిథులకు అందజేశారు. జి.ఎ.శ్రీనివాసమూర్తి, డాక్టర్ పి.శ్రీహరి, డాక్టర్ అనిల్ ఖురానా, ఎం.ఎల్.నారాయణ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఎంబీటీ మద్దతు



మాజీ కార్పొరేటర్ అంజదుల్లా ఖాన్‌తో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

చార్మినార్: ఈ ఎన్నికల్లో ఎంబీటీ పార్టీ తరపున మాజీ కార్పొరేటర్ అంజదుల్లా ఖాన్ తమ పార్టీకి పూర్తిగా సహకరించిందని.. అలాగే రాబోయే ఎన్నికల్లో కూడా తమకు పూర్తిగా మద్దతు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా చార్మినార్ నియోజకవర్గం నుంచి కూడా ఎంబీటీ తరపున తనకు పూర్తిగా మద్దతు తెలిపినందుకు అంజదుల్లాఖాన్‌ను చంచల్‌గూడలోని పార్టీ కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలియజేసినట్లు ముజీబ్ ఉల్లా షరీఫ్ తెలిపారు.

రాబోయే పార్లమెంట్, బల్దియా ఎన్నికలకు సిద్ధం



అంజదుల్లాఖాన్‌ను సన్మానిస్తున్న బుంగ శివకుమార్

చార్మినార్: ఈసారి జరిగిన ఎన్నికల్లో యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీని ధీటుగా ఎదుర్కొని కేవలం 878 ఓట్ల తేడాతో పరాజయం పొందిన మాజీ కార్పొరేటర్, ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లాఖాన్‌తో ఈనెల 10న పటేల్‌నగర్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని ఎంబీటీ పార్టీ సంయుక్త కార్యదర్శి బుంగ శివకుమార్ తెలిపారు. శుక్రవారం చంచల్‌గూడలోని ఎంబీటీ పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి సన్మానించినట్లు ఆయన తెలిపారు. రాబోయే పార్లమెంట్, బల్దియా ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నువ్వా..నేనా..అనే రీతిలో ఎన్నికల పోరాటం చేసిన అంజదుల్లా ఖాన్‌కు ఈ సందర్భంగా సన్మానించనున్నట్లు ఆయన తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను సత్కరిస్తున్న ఆల పురుషోత్తమ్‌రావు, రాంచంద్రరాజ్

అబిడ్స్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. పదేళ్లుగా ప్రజలకు నిరంతరం సేవలందించిన తనను ప్రజలు మరోసారి గెలిపించారన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు, రాంచందర్‌రాజ్ నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తాను ముందుంటానన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తా: రాజాసింగ్



రాజాసింగ్‌ను కలిసిన జై భీమ్ నవ యుకవ సంఘం బస్తీ వాసులు

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. శుక్రవారం గుర్రంగోలికి చెందిన జై భీమ్ నవయుగ సంఘం బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అద్దాకుల లక్ష్మీనారాయణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. తనను మంచి మెజార్టీతో గెలిపించిన దళిత సోదరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ సంఘం చైర్మన్ శంకరన్న, వైస్ ప్రెసిడెంట్ దాస్, కోశాధికారి బాబన్న, ఆర్గనైజర్, మల్లేష్, అడ్వైజర్ జానకిరామ్, దేవకర్ణ, మధు, మహేందర్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు నెల రోజుల పాటు అన్నప్రసాదం పంపిణీ



అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్

అబిడ్స్: అయ్యప్ప భక్తుల కోసం నెల రోజుల పాటు ఉచితంగా అన్నప్రసాద కార్యక్రమాలు చేపడుతున్నట్లు గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ పేర్కొన్నారు. గ్యాన్‌బాగ్‌కాలనీ చౌరస్తాలోని భారత్ కమ్యూనిటీ హాల్‌లో జనవరి 10వ తేదీ వరకు ప్రతిరోజూ దాదాపు 400 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద పంపిణీ చేస్తామన్నారు. సంకట హరణ అయ్యప్ప సేవా సంఘం వారి ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా ఈ సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు.

‘నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా’



పూల్‌బాగ్‌లో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

చాంద్రాయణగుట్ట: ఆరోసారి తనను బంపర్ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఉప్పుగూడ డివిజన్‌లోని పూల్‌బాగ్, నర్కీపూల్ బాగ్ బస్తీల్లో శుక్రవారం ఆయన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ఇంటింటికీ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కచేరీలో గీతాలను ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కొన్ని పార్టీల నాయకులు వచ్చి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. అలాంటి వారి ట్రాప్‌లో పడరాదన్నారు. మజ్లిస్ పార్టీ ముస్లింల కష్ట సుఖాలలో అండగా ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ఎంతో అభివృద్ధి చేశామని.. మున్ముందు కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా ముస్లింలు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటింగ్ శాతం పెంచేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పుగూడ కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాద్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్, నాయకులు వర్కల నాగరాజు, సతీష్, బాబు, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పైనుంచి పడి వ్యక్తికి గాయాలు


నాంపల్లి: నిలోఫర్ ఆస్పత్రిలో అపశృతి చోటుచేసుకుంది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పైనుంచి కిందపడి ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ క్షతగాత్రుడు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోనికి వచ్చిన ఈ ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. వివరాలలోనికి వెళితే.. నిలోఫర్‌లో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను బిహార్ కార్మికులు చేస్తున్నారు. పనులు చేస్తున్న తమ బంధువును చూసేందుకు దేవేందర్ అనే వ్యక్తి వచ్చారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనుల్లో నిమగ్నమైన బంధువులను చూసేందుకు దేవేందర్ పైకి వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డారు. గాయపడ్డ అతడిని హుటాహుటిన అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేకు సన్మానం



అబిడ్స్: కాంగ్రెస్ పార్టీ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన బీర్ల ఐలయ్యను తెలంగాణ రాష్ట్ర ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ పోలకం శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కొనసాగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అగ్రగామిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, శివకుమార్, పోల్కం వినయ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిరెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సమస్యలను తెలిసిన నాయకుడిగా ముఖ్యమంత్రి వారి ఆశలను ఆకాంక్షలను నెరవేర్చాలని తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ హెచ్-1 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి కోరారు. శుక్రవారం కోఠిలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా యూనియన్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న జీఓ నెంబర్-142 ను రద్దుచేసే దిశగా కృషి చేయాలని కోరారు. అలాగే జీఓ 317లో నష్టపోయిన ఉద్యోగుల బాధలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర చీఫ్ అసోసియేట్ ప్రెసిడెంట్ రాజశేఖర్, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, భద్రాద్రి అధ్యక్షులు రాంప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

కళాకారులకు ఆర్థిక సాయం



కళాకారులను సత్కరిస్తున్న సారిపల్లి కొండలరావు, లంక లక్ష్మీనారాయణ

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో సర్వకళాకారుల సంక్షేమ వేదిక ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పలువురు ఔత్సాహిక కళాకారులు పాల్గొని భారతీయ శాస్త్రీయ నృత్యాంశాలను ప్రదర్శించారు. కళలను పరిరక్షిస్తున్న పలువురు కళాకారులకు ఆర్థిక సహాయాన్ని సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు, యువ కళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, అంబిక కృష్ణ, అశ్విని సుబ్బారావు చేతుల మీదుగా అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారులు చేస్తున్న కృషిని అతిథులు ప్రశంసించారు.

నిబంధనలు పాటించని వ్యక్తికి జైలు

డబీర్‌పురా: నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయంలో ఫుడ్ కోర్టు షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 6వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి టి.ఆర్.పద్మజా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..తేజేశ్వర్ మీరాలంమండి జహేరానగర్‌లో ఫుడ్‌కోర్టు షాపును నిర్వహిస్తున్నాడు. రాత్రి 12 గంటల వరకు షాపును ఓపెన్ చేయడంతో కేసు బుక్ చేసి శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా.. పూర్వ పరాలను పరిశీలించిన న్యాయమూర్తి టి.ఆర్.పద్మజా తేజేశ్వర్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.